సాక్షి
శ్రీకాకుళం
గురువారం । 21 । సెప్టెంబర్ । 2023



అన్నదాతకు రుణపరపతి

రైతులకు రుణ పరపతి పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 2023–24లో పంటల వారీగా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచింది.

- IIలో



సమస్యలు పునరావృతం కాకూడదు

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదని ఇన్‌చార్జి కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. బుధవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించారు.

- IIలో

రేపటి నుంచి దేహదారుఢ్య పరీక్షలు

శ్రీకాకుళం క్రైమ్ : పోలీసు నియామక ప్రక్రియలో భాగంగా విశాఖపట్నం జోన్‌కు సంబంధించి ఎస్‌ఐ ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులు ఈ నెల 22 (మహిళలు), 23న (పురుషులు) దేహదారుఢ్య పరీక్షలకు హాజరుకావాలని విశాఖపట్నం రేంజ్ డీఐజీ కె.హరికృష్ణ బుధవారం తెలిపారు. గత నెల 25 నుంచి విశాఖపట్నం కైలాసగిరి ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసు మైదానంలో దేహదారుఢ్య పరీక్షలు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఇప్పటికీ హాజరుకాని అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

న్యూస్‌రీల్

మూలపేట పోర్టు పరిశీలన



పోర్టును పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ నూరుల్‌కమార్

సంతబొమ్మాళి: టెక్కలి సబ్ కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన నూరుల్ కమార్ బుధవారం మూలపేట పోర్టును పరిశీలించారు. పనుల స్థాయిని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు విశ్వసముద్ర జీఎం శంకర్, తహసీల్దార్ చలమయ్య తదితరులు ఉన్నారు.

మిస్సింగ్ కేసులపై దృష్టి పెట్టాలి



బారువ పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ రాధిక

సోంపేట: పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎస్పీ జి.ఆర్.రాధిక సిబ్బందికి సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా బారువ పోలీస్ స్టేషన్‌ను బుధవారం సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తు వెంటనే పూర్తి చేయాలన్నారు. మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కాశీబుగ్గ డీఎస్పీ నాగేశ్వర రెడ్డి, సీఐ రవిప్రసాద్, ఎస్ఐ చిరంజీవి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

త్వరితగతిన చార్జిషీట్ ఫైల్‌చేయాలి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: జైలులో ఉన్న ముద్దాయిల కేసుల విషయంలో పోలీసులు త్వరితగతిన చార్జిషీట్ ఫైల్ చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. బుధవారం జిల్లా కోర్టులో అండర్ ట్రయల్ ప్రిజనర్స్ రివ్యూ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసుల పరిష్కారానికి అధిక ప్రాధాన్యమివ్వాలన్నారు. సమావేశంలో అదనపు న్యాయమూర్తులు శ్రీదేవి, ఫణికుమార్, భాస్కరరావు, సీనియర్ సివిల్ జడ్జి, డీఎల్ఎస్ఏ ఇన్‌చార్జి కార్యదర్శి అనురాధ, అడిషనల్ ఎస్పీ విఠలేశ్వరరావు, డీఆర్ఓ ఎం.గణపతిరావు, జిల్లా జైలు సూపరింటెండెంట్ నబీఖాన్, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ మెట్ట మల్లేశ్వరరావు, పాలకొండ ఎస్‌డీపీఓ జి.వి.కృష్ణారావు, ఎస్ఈబీ ఆఫీసర్ మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

● రెండు పంటల స్వప్నం

సాకారానికి శ్రీకారం

- ప్రారంభమైన వంశధార లిఫ్ట్ ఇరిగేషన్ పనులు
- రెండు సీజన్‌లు..రెండు పంటలకు మార్గం సుగమం
- రూ.176.35కోట్ల వ్యయంతో స్కీమ్ రూపకల్పన
- గొట్టా బ్యారేజీ ఎగువన కోరాడ వద్ద పనులు
- రబీ కల్లా ప్రాజెక్టు పూర్తి చేసేలా అడుగులు
- నెరవేరనున్న జిల్లా రైతుల కల



పంప్‌హౌస్ పనుల్లో భాగంగా తవ్వకాలు జరుగుతున్న దృశ్యాలు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: జిల్లా ప్రజల సుదీర్ఘ కల నెరవేరబోతోంది. వంశధార ప్రాజెక్టు ద్వారా ఖరీఫ్, రబీ సీజన్‌లో రెండు పంటలకు నీరందించేందుకు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ పనులు షురూ అయ్యాయి. వచ్చే రబీ కల్లా పూర్తి స్థాయిలో అందుబాటులోకి తెచ్చేందుకు ఇప్పటికే పనులు ప్రారంభమయ్యాయి. పనులు వడివడిగా చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల ఏర్పాట్లు చేసింది. 2.50 లక్షల ఎకరాలకు, ముఖ్యంగా శివారు ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరందించేందుకు ఉద్దేశించిన వంశధార లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పూర్తయితే జిల్లా సస్యశ్యామలం కానుంది. సాధ్యమైనంత వేగంగా పూర్తి చేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు లిఫ్ట్ ఇరిగేషన్ యూనిట్ నిర్మాణం జరుగుతోంది.



ఏళ్ల తరబడి నిరీక్షణ..

వంశధార ప్రాజెక్టు ఫేజ్–2లోని స్టేజ్ 2 పనుల కోసం ఇప్పటికే రూ.2,069 కోట్లు మేర ఖర్చు చేశారు. దాదాపు 92శాతం పనులు పూర్తయ్యాయి. ఒడిశా అభ్యంతరాల కారణంగా కీలకమైన నేరడి బ్యారేజీకు లైన్ క్లియర్ కాకపోవడంతో చేసిన ఖర్చుకు సార్థకత ఉండటం లేదు. హిరమండలం జలాశయం నిండితేనే జనాశయం నెరవేరుతుంది. అంత పెద్ద జలాశయం నిండాలంటే ఎగువన నేరడి వద్ద బ్యారేజీ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. కానీ, ఒడిశా నుంచి అడ్డంకులు కారణంగా నేరడి బ్యారేజీకి అడుగులు పడలేదు. దీంతో వేల కోట్లు ఖర్చు పెట్టినప్పటికీ వంశధార ప్రాజెక్టు లక్ష్యం నెరవేరలేదు. ఏళ్ల తరబడి నిరీక్షణ కొనసాగుతూనే ఉంది. ఈ నేపథ్యంలో వైఎస్ జగన్ ప్రభుత్వం కొత్తగా ఆలోచించింది. ఏం చేస్తే పూర్తి స్థాయి ఆయకట్టుకు సాగునీరు అందించవచ్చో మార్గాన్ని అన్వేషించింది. గొట్టా బ్యారేజీ వద్ద నీటిని ఎత్తిపోసి రిజర్వాయర్‌కు పంపిస్తే వరద నీరు సముద్రం పాలుకాకుండా సంరక్షించవచ్చని భావించింది. దీనికోసం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు(ఎత్తిపోతల పథకం) నిర్మిస్తే సరిపోతుందని నిర్ణయం తీసుకుంది. వెంటనే రూ.176.35కోట్లు మంజూరు చేసింది. పారదర్శకంగా టెండర్లు పిలిచింది. లోయస్ట్ కోట్ చేసిన కంపెనీకి టెండర్లు ఖరారు చేసింది. ఆ ప్రాజెక్టు పనులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన జరిగింది.

లిఫ్ట్‌తో పరిష్కారం..



లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు నమూనా

జిల్లాలో అత్యధిక ఆయకట్టులో రెండు పంటలు పండాలంటే ముందు వేసవిలో వంశధార కాలువ నిండుగా ప్రవహించాలి. హిరమండలంలోని వంశధార రిజర్వాయర్‌కు 19.5 టీఎంసీల నీరు వచ్చి చేరాలి. ఇప్పుడా పరిస్థితి లేదు. ఖరీఫ్‌లోనే పూర్తి స్థాయి ఆయకట్టుకు నీరందడం లేదు. ఇక రబీ కోసమైతే చెప్పనక్కర్లేదు. 19.5 టీఎంసీల నీటిని తీసుకొస్తే మూడు పంటల సాకారం నెరవేరుతుంది. ప్రస్తుతం హిరమండలం రిజర్వాయర్‌లో డెడ్ స్టోరేజ్ కింద 2.5 టీఎంసీల నీరు ఉంటుంది. ఫ్లడ్‌ఫ్లో కెనాల్, కొండ చరియల నుంచి వచ్చే నీరు మరో 4 టీఎంసీలు ఉంటుంది. మిగిలినది నింపాలంటే ఒకటి నేరడి బ్యారేజీ నిర్మాణం పూర్తి చేసి నదిలో నీటిని మళ్లించడం, లేదంటే గొట్టా బ్యారేజీ వద్ద లిఫ్ట్ ఏర్పాటు చేయడమే మార్గం. అయితే, నేరడి బ్యారేజీ నిర్మాణానికి ఉన్న అడ్డంకులు కారణంగా ఈ లోపు మొత్తం ఆయకట్టును సస్యశ్యామలం చేయాలంటే లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ తప్పనిసరి అని భావించింది. ఆ ఆలోచనతో ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన నిధులు మంజూరు చేసింది.

ప్రతిపాదించిన పనులు..

గొట్టా బ్యారేజీ ఎగువన కోరాడ రెవెన్యూ గ్రామం వద్ద ఎత్తిపోతల పథకం నిర్మించి సుమారు 100 రోజుల కాలంలో 16 గంటల పాటు పంపింగ్‌తో 2.5 కిలోమీటర్ల దూరంలో ఉన్న హిరమండలం రిజర్వాయర్‌కు 12టీఎంసీలకు పైగా నీటిని లిఫ్ట్ చేయనున్నారు. దీనివల్ల ఖరీఫ్, రబీలో మొత్తం ఆయకట్టుకు నీరందించేలా లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌ను డిజైన్ చేశారు. గొట్టా బ్యారేజీ కుడి ప్రధాన కాలువ 2.4 కిలోమీటర్ల వద్ద పంప్ హౌస్, నాలుగు పంపుల ద్వారా ఎత్తిపోసేలా, 525 మీటర్ల పైపులైన్ల ద్వారా నీటిని పంపించేందుకు రూపకల్పన చేశారు. ఒక్కో పంపు సెకెన్‌కు 10క్యూబిక్ మీటర్ల పరిమాణంలో నాలుగు పంపుల ద్వారా సెకెనుకు 40 క్యూబిక్ మీటర్ల నీటిని 100రోజుల పాటు పంపిస్తే 12 టీఎంసీల నీరు రిజర్వాయర్‌లోకి చేరుతుందని లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌ను ప్రతిపాదించారు. నాలుగు ట్రాష్ ర్యాక్‌లు, నాలుగు స్టాప్‌లాగ్ గేట్లు, 31.00 మీటర్ల సంప్ ఫ్లోర్ లెవెల్, 38.113 మీటర్ల వాటర్ లెవెల్ పనులు, 40.000 మీటర్ల పంప్ ఫ్లోర్ లెవెల్ పనులు, 45.000 మీటర్ల మోటార్ ఫ్లోర్ లెవెల్, 69.00 మీటర్ల డెలివరీ లెవల్ తదితర హైడ్రాలిక్ సిస్టమ్‌తో స్కీమ్ నిర్మాణం జరగనుంది.

చకచకా పనులు..



మెటీరియల్‌ను దించుతూ..

లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు సంబంధించి పంపు హౌస్, ప్రైజర్ మెయిన్, డెలవరీ సిస్టమ్, పైపు లైను, పంపింగ్ మోటార్స్ పనులు చేపట్టాల్సి ఉంది. వాటిలో ఇప్పటికే పంప్ హౌస్, ప్రైజర్ మెయిన్ మ్యానుఫ్యాక్చరింగ్ పనులు ప్రారంభమయ్యాయి. వేగంగా పనులు చేసే సమయంలో వర్షాల వల్ల అటంకం ఏర్పడింది. ప్రాధాన్యత క్రమంలో మిగతా పనులు చకచకా చేపట్టేలా యంత్రాంగం కార్యాచరణ రూపొందించింది. ఒకవైపు ఎలక్ట్రిఫికేషన్, మరోవైపు లిఫ్ట్ పనులు వేగంగా చేసి జనవరి నాటికి కొలిక్కి తెచ్చేలా అడుగులు పడుతున్నాయి. ఇరిగేషన్ డీఈ రవికాంత్ పర్యవేక్షణలో ఈ పనులు జరుగుతున్నాయి.

వంశధార అధికారులపై చర్యలకు ఆదేశాలు

పలాస: వంశధార అధికారులపై చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు చీఫ్ సెక్రటరీ నుంచి మెమో జారీ అయ్యిందని పలాస ఎంపీపీ ఉంగ ప్రవీణ చెప్పారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ వంశధార అధికారుల పనితీరుపై ముఖ్యమంత్రికి లేఖ రాశానని, అందుకు సీఎం స్పందించి తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారన్నారు. కొన్నేళ్లుగా పలాస, వజ్రపుకొత్తూరు మండలాల శివారు ప్రాంతాలకు నీరు రావడం లేదని, అయినా అధికారులు ఉన్నతాధికారులకు నీరు ఇస్తున్నట్టు తప్పుడు సమాచారం ఇస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు రైతులకు సాగు నీరు అందించేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

సమన్వయంతోనే ఉత్తమ ఫలితాలు



మాట్లాడుతున్న ఏపీఎస్ఐఆర్‌డీ డైరెక్టర్ మురళి

అరసవల్లి: గ్రామీణాభివృద్ధిలో భాగంగా పంచాయతీ కార్యదర్శులు సమన్వయంగా పనిచేస్తేనే ఉత్తమ ఫలితాలు సాధ్యమవుతాయని ఏపీ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ జె.మురళి అన్నారు. బుధవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో కార్యదర్శుల రీఫ్రెషర్ శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 24 రోజుల శిక్షణలో భాగంగా ప్రతి కార్యదర్శి ప్రభుత్వం అప్పగించిన బాధ్యతలను సక్రమంగా అమలు చేయాలని సూచించారు. శిక్షణలో నేర్చుకున్న మెలకువలను, నిబంధనలను వినియోగించుకుని గ్రామ పంచాయతీలను అభివృద్ధి పథంలో నడిపించాలన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల సిబ్బంది సమన్వయం చేసుకుని లక్ష్యాలను శతశాతం చేరుకోవాలని సూచించారు. ధ్యానం ద్వారా ఒత్తిడిని జయించే అవకాశముంటుందన్నారు. కార్యక్రమంలో పీఆర్ అసిస్టెంట్ కమిషనర్ ఇ.కృష్ణమోహన్, హార్ట్‌ఫుల్ సంస్థ ప్రతినిధి లక్ష్మణరావు, డీఎల్‌పీఓ గోపిబాల, ఐ.వి.రమణ, డి.పి.ఆర్.సి. జిల్లా కోఆర్డినేటర్ పి.వి.రాజు, డీటీఎం లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

గ్రానైట్ పాలిషింగ్ షీట్ల పట్టివేత



కంటైనర్‌ను తనిఖీ చేస్తున్న విశ్వసముద్ర సిబ్బంది

టెక్కలి: నందిగాం మండలం దేవుపురం సమీపంలో సన్ ఇండియా రాక్స్ పాలిషింగ్ యూనిట్ నుంచి పర్మిట్‌లో పేర్కొన్న దాని కంటే అదనంగా 18 ఎం.ఎం. పరిమాణం గల కలర్ గ్రానైట్ పాలిషింగ్ షీట్లను తరలిస్తున్న కంటైనర్‌ను బుధవారం టెక్కలి సమీపంలో విశ్వ సముద్ర సిబ్బంది పట్టుకున్నారు. పర్మిట్‌లో సుమారు 5,442.739 చదరపు అడుగులకు బిల్లు తీసుకుని 6,259.79 చదరపు అడుగుల మేరకు గ్రానైట్ పాలిషింగ్ షీట్లను కంటైనర్‌లో విశాఖ పోర్టుకు తరలిస్తుండగా.. నందిగాం మండలం లట్టిగాం నుంచి విశ్వ సముద్ర సిబ్బంది సదరు వాహనాన్ని తనిఖీ చేసేందుకు ప్రయత్నించారు. అయినా వాహనం ఆపకుండా వేగం పెంచడంతో వెంబడించి టెక్కలి సమీపంలో మెళియాపుట్టి రోడ్డులో పట్టుకున్నారు. వీఎస్ సిబ్బంది తనిఖీలు చేయగా అదనంగా 817 చదరపు అడుగులు ఉన్నట్లు గుర్తించారు. దీంతో విషయాన్ని మైనింగ్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. అక్కడ అధికారులు పరిశీలించి సుమారు రూ.50 వేల అపరాధ రుసుం విధించారు.

● జోరువానలోనూ జనం చెంతనే..!



కొత్తూరు మండలం మెట్టూరు బిట్–3(ఇరపాడు)లో బుధవారం ఎడతెరిపిలేకుండా వర్షం కురుస్తున్నా పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కొనసాగించారు. ప్రతి ఇంటికీ వెళ్లి నాలుగేళ్లలో కలిగిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

– కొత్తూరు

ఆమదాలవలస మున్సిపల్ ప్రత్యేకాధికారిగా జెడ్పీ సీఈఓ

ఆమదాలవలస: ఆమదాలవలస మున్సిపల్ ప్రత్యేకాధికారిగా శ్రీకాకుళం జెడ్పీ సీఈఓ ఆర్.వెంకట్రామన్‌ను నియమిస్తూ బుధవారం స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు ఆమదాలవలస మున్సిపల్ ప్రత్యేకాధికారిగా శ్రీకాకుళం ఆర్‌డీఓ బి.శాంతి కొనసాగారు. మున్సిపల్ ఎన్నికలు నిర్వహించకపోవడంతో మున్సిపాలిటీలో ప్రత్యేకాధికారితో అభివృద్ధికి సంబంధించి లావాదేవీలు జరుగుతున్నాయి. పనులు వేగవంతం చేసేందుకు ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రత్యేకాధికారులను మార్చినట్లు సమాచారం. ప్రస్తుతం మున్సిపల్ ప్రత్యేకాధికారిగా నియమితులైన జెడ్పీ సీఈఓ 2024 జనవరి 2 వరకు కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

యువతిని మోసగించిన కేసు

టీచర్‌కు రిమాండ్

వజ్రపుకొత్తూరు రూరల్: పెళ్లి పేరుతో యువతిని మోసగించిన కేసులో ఉపాధ్యాయుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు కాశీబుగ్గ రూరల్ సీఐ జి.శంకరరావు తెలిపారు. వజ్రపుకొత్తూరు గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు వరశెట్టి రాజేష్ ఇచ్ఛాపురం ఎంపీపీ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. సహ ఉపాధ్యాయురాలిని 2021 నవంబర్‌లో ఇంట్లో తెలియకుండా రహస్యంగా వివాహం చేసుకున్నాడు. అయితే మొదట జరిగిన వివాహం బయటకు చెప్పకుండా స్వగ్రామంలో మరో యువతితో పెళ్లికి సిద్ధమయ్యాడు. ఈ మేరకు జూన్ 2022న యువతితో నిశ్చితార్థం చేసుకున్నాడు. కాబోయే భార్యభర్తలం అంటూ నమ్మబలికి శారీరకంగా లోబర్చుకున్నాడు. యువతి కుటుంబ సభ్యులు పెళ్లి చేసుకోమని అడిగినప్పుడల్లా తప్పించుకునే ప్రయత్నం చేస్తూ వచ్చాడు. ఈ విషయాన్ని యువతి తల్లిదండ్రులు పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టినా పెళ్లికి అంగీకరించకపోవడంతో బాధిత యువతి బుధవారం పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసి ఉపాధ్యాయుడిని అరెస్ట్ చేసి పలాస కోర్టులో హాజరు పరచగా మెజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు. ఆయనతో పాటు ఎస్సై వై.మధుసూదన్‌రావు ఉన్నారు.

● గణపయ్య గూడు.. బాగుంది చూడు

వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన పలు మండపాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. పర్యావరణ స్పృహ కలిగిస్తూ.. దేశంలో జరిగిన తాజా పరిణామాలను ఇతివృత్తంగా తీసుకుంటూ వినూత్నంగా మండపాలు తీర్చిదిద్దారు. వీటిని భక్తులు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



కంచిలి: బెల్లుపడ గ్రామంలో తాజ్‌మహల్ రూపంలో..



కాశీబుగ్గ: మొగిలిపాడులో చంద్రయాన్–03 ఆకృతిలో..



పలాస కాపువీధిలో పక్షి ఆకారంలో..



వజ్రపుకొత్తూరు రూరల్: గుళ్లలపాడులో కొబ్బరి కమ్మల మండపం

క్లుప్తంగా

నేడు గురజాడ జయంతి సభ

శ్రీకాకుళం కల్చరల్: యుగ కవి గురజాడ అప్పారావు 121వ జయంతి సభ గురువారం సాయంత్రం 5 గంటలకు శ్రీకాకుళం ఎన్జీవో హోంలో నిర్వహిస్తున్నట్లు అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యవర్గ సభ్యులు నల్లి ధర్మారావు ఒక ప్రకటనలో తెలిపారు. సంఘం జాతీయ అధ్యక్షులు, రచయిత, సాహితీ విమర్శకులు పెనుగొండ లక్ష్మీనారాయణ, ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు, అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరవుతారని పేర్కొన్నారు. గురజాడ అభిమానులంతా హాజరుకావాలని కోరారు.

సబ్ కలెక్టర్‌ను కలిసిన డీఎస్పీ



నూరుల్ కమార్‌తో డీఎస్పీ బాలచంద్రారెడ్డి

టెక్కలి: టెక్కలి సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన నూరుల్‌కమార్‌ను డీఎస్పీ డి.బాలచంద్రారెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సబ్ డివిజన్ పరిధిలో శాంతిభద్రతల అంశాలను ప్రస్తావించారు.

పశువుల కంటైనర్ సీజ్

జలుమూరు: నారాయణవలస సంత నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న 79 పశువులతో కూడిన కంటైనర్‌ను సీజ్ చేశామని ఎస్ఐ పి.పారినాయుడు బుధవారం తెలిపారు. ఎస్ఈబీ పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు లింగాలవలస వద్ద మాటువేసి కంటైనర్‌ను స్వాధీనం చేసుకుని పశువులను కొత్తవలస గోశాలకు తరలించినట్లు చెప్పారు. ఈ ఘటనలో రాజస్థాన్‌కు చెందిన సలీమ్, హర్యానాకు చెందిన మొఫిద్దన్‌లపై కేసు నమోదు చేశామన్నారు.

ఉత్తమ ఫలితాల సాధనే ధ్యేయం



గ్రీన్‌కోర్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉప విద్యా శాఖాధికారి పగడాలమ్మ

టెక్కలి: రానున్న పదో తరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని టెక్కలి ఉప విద్యాశాఖాధికారి జి.పగడాలమ్మ సూచించారు. పాతనౌపడ సమీపంలో ప్రణవి కళాశాలలో డివిజన్ పరిధిలోని ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఏడాది పదో తరగతి ఫలితాల్లో జిల్లాలో టెక్కలి డివిజన్ ద్వితీయస్థానం సాధించిందని, అదే స్ఫూర్తితో ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. పాఠశాలల్లో అమలవుతున్న జగనన్న గోరుముద్ద, నాడు–నేడు పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అనంతరం పాఠశాలలో అమలవుతున్న గ్రీన్ కోర్‌కు సంబంధించి పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో డీసీఈబీ కార్యదర్శి జి.రాజేంద్రప్రసాద్, పరీక్షల విభాగం కన్వీనర్ డి.లక్ష్మీనారాయణ, ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు వి.సత్యనారాయణ, కోశాధికారి చిలుకు కృష్ణారావు, రామకృష్ణ, కె.నగేష్, ప్రకాష్, రమేష్, బెనర్జీ పాల్గొన్నారు.

అక్షరాస్యతతో పేదరికం దూరం



మాట్లాడుతున్న డైరెక్టర్ ప్రసాదరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: సంపూర్ణ అక్షరాస్యతతోనే సమాజంలో పేదరికం దూరమవుతుందని యూత్ క్లబ్ బెజ్జిపురం డైరెక్టర్ ఎం.ప్రసాదరావు అన్నారు. అక్షరాస్యతతో అంతరాలు తొలగిపోయి ఆర్థిక స్థితిగతులు మారి అభివృద్ధి సాకారమవుతుందని చెప్పారు. బెంగళూరుకు చెందిన ఇండియా లిటరసీ ప్రాజెక్ట్ సహకారంతో నిర్వహిస్తున్న స్కూల్ రెడీనెస్ బాలవికాస్ ప్రోగ్రామ్స్‌లో భాగంగా శ్రీకాకుళంలోని యూత్‌క్లబ్ బెజ్జిపురం కార్యాలయం వద్ద 35 మంది క్లస్టర్ రిసోర్స్ పర్సన్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. శ్రీకాకుళం రూరల్, గార, ఎచ్చెర్ల, జి.సిగడాం, లావేరు, రణస్థలం, పొందూరు మండలాల్లోని రిసోర్స్ పర్సన్లకు విధులు, బాధ్యతల నిర్వహణపై అవగాహన కల్పించారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరక్షరాస్యులను గుర్తించి చదువుకునేలా సన్నద్ధత చేయడమే మన లక్ష్యమన్నారు. శతశాతం అక్షరాస్యత సాధనలో సీఆర్పీల పనితీరు అభినందనీయమని జి.అప్పలనాయుడు, టి.కరుణాకరరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో వై.శంకరరావు, రమణమూర్తి, ఆర్.కల్పన, హేమసుందర్, సంతోషి, సోషల్ వర్క్ విద్యార్థులు పాల్గొన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹145	₹245	₹ 265

అన్నదాతకు రుణపతి

- 2023-24లో పంటలవారీగా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌లో పెంపు
- భారీగా లబ్ధి పొందనున్న సన్న, చిన్నకారు రైతులు



వరి దమ్ము చేస్తున్న రైతులు

కవిటి : ఆరుగాలం శ్రమించే అన్నదాతకు రాష్ట్ర ప్రభుత్వం గౌరవప్రదమైన రుణపరపతి కల్పించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి వివిధ పంటలకు అందించే రుణాలను జిల్లాస్థాయి సాంకేతిక కమిటీ(డీఎల్‌టీసీ) ఇటీవల వెల్లడించింది. ఈ నేపథ్యంలో పెరిగిన సాగు ఖర్చులను పరిగణనలోకి తీసుకొని స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను సవరించిన కొత్తజాబితా జిల్లా కలెక్టర్ ఆమోదంతో అమల్లోకి వచ్చింది. కూలీల రేట్లు, ఇతర పెట్టుబడి ఖర్చులు భారీగా పెరిగిన ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రుణపరపతి పెరిగింది. రిజర్వ్ బ్యాంక్ 2019 ఖరీఫ్ నుంచి సవరించిన మార్గదర్శకాల మేరకు పంట రుణం మొత్తాన్ని ఎటువంటి పూచీకత్తులు సమర్పించకుండానే రూ.1.60 లక్షలు పొందే వీలు కల్పించింది. తాజా నిర్ణయంతో జిల్లాలో వరి సాగు చేసే సుమారు 4.50 లక్షల మంది సన్న, చిన్నకారు, పెద్ద రైతులకు ప్రయోజనం కలగనుంది. 32565 ఎకరాల్లో కొబ్బరి సాగుచేస్తున్న 2.12 లక్షలమంది కొబ్బరి రైతులకు సైతం ఈ పెంపుదల లాభించనుంది.

పెంపునిర్ణయం వర్తించేదిలా..

వ్యవసాయానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్త సహకారంతో పంట రుణాలను ప్రతి ఏడాది ఖరీఫ్, రబీ సీజన్‌లలో అందిస్తున్నారు. ఈ రుణాలతో పాటు వ్యవసాయ యంత్ర పరికరాల కొనుగోలు, ట్రాక్టర్ల కొనుగోలు తదితర రకాలైన రుణాలను సైతం అందజేస్తున్నారు. ఈ విధానంలో గత ప్రభుత్వ హయాంలో చివరి రబీ సీజన్(2018–19)లో రూ.లక్ష వరకు పంట రుణాల గరిష్ట అవధి ఎటువంటి పూచీకత్తులు లేకుండా బ్యాంక్‌లో 1బీ, అడంగల్ అందిస్తే తక్షణమే రైతుకున్న భూమి విస్తీర్ణం ఆధారంగా గరిష్టంగా పంటరుణం అందించేవారు. ప్రస్తుతం అదే పంటరుణాలు కేవలం అడంగల్, 1బీలను దాఖలుచేసి గరిష్టంగా రూ.1.60 లక్షలకు పెంచడం ద్వారా అధిక శాతం రైతులకు ప్రయోజనం చేకూరింది. గతంలో రూ.లక్ష కన్నా అధిక మొత్తం పంట రుణం కావాలంటే మిగిలిన మొత్తానికి సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో తమ భూమిని రుణంతీసుకునే బ్యాంకులో మార్టుగేజ్ చేయాల్సి ఉండేది. తాజా పెంపు నిర్ణయంతో మార్టుగేజ్ అవసరం లేకుండానే కేవలం 1బీ అడంగల్, పాస్‌పుస్తకం జిరాక్స్ కాపీలు బ్యాంకుకు అందిస్తే తక్షణమే సంబంధిత మేనేజర్ రుణాల్ని ఇచ్చేవీలుంది. ఇటీవల డీఎల్‌టీసీ రూపొందించిన రుణవితరణ జాబితా 2023–24 ఆర్థికసంవత్సరం ఖరీఫ్ సీజన్‌కు వర్తింపజేయనున్నారు.

పంటరకం	స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ (2022–23)	స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ (2023–24)
వరి	38000–40000	42000–45000
జొన్న	18,000–20,000	19000–21000
రాగి	14,000–18,000	16000–20000
ఆయిల్‌పాం	47,300–51700	55000–60000
కందులు	16000–20000	18000–22000
మినుములు	15000–18000	18000–20000
పెసలు	15000–18000	18000–20000
వేరుశెనగ	30000–32000	32000–35000
కొబ్బరి	33000–44000	44000–47000
అరటి	60,500–77,000	65000–80000
చెరకు	71500–75900	77000–80000
జీడి మామిడి	28000–30000	30000–35000

శతశాతం ఖరీఫ్ రుణాల మంజూరు..

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి జిల్లాలో వ్యవసాయ రుణ ప్రణాళికను ప్రకటించారు. ఇందులో ఖరీఫ్ సీజన్‌కు గానూ స్వల్పకాలిక, దీర్ఘకాలిక పంటరుణాలు, వ్యవసాయ ఇన్‌ఫ్రా రుణాలు యాన్సిలరీ యాక్టివిటీ రుణాలన్నీ కలిపి ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.4068 కోట్లుగా నిర్ధారించారు. అయితే ఈ ఏడాది ఆగస్టు 31 నాటికే శతశాతం లక్ష్యాల్ని పూర్తి చేశారు. అదేవిధంగా ఈ ఏడాది రబీ సీజన్‌కు రూ.2712 కోట్లుగా రుణలక్ష్యాన్ని నిర్దేశించారు.

సద్వినియోగం చేసుకోవాలి..



రిజర్వ్ బ్యాంక్ వ్యవసాయ రంగంలో వచ్చిన పంట పెట్టుబడులు, రాబడి, ఖర్చులు, ద్రవ్యోల్బణం తదితర అంశాలను ప్రామాణికంగా పంటరుణానికి నిర్దేశించిన పంటలకు కొత్తస్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌లను సూచిస్తూ పెంపుదల చేసింది. ఇందుకు సంబంధించి బ్యాంకులకు మార్గదర్శకాలు కూడా వెలువరించింది. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఇప్పటివరకు నిర్దేశిత లక్ష్యాల్ని ఖరీఫ్ సీజన్‌కు పూర్తిచేయగలిగాం. – సూర్యకిరణ్, జిల్లా లీడ్‌బ్యాంక్ మేనేజర్, శ్రీకాకుళం

తక్కువ డాక్యుమెంటేషన్‌తోనే..



రైతులు పంట పెట్టుబడి కోసం బ్యాంకులు ఇస్తున్న రుణం ఆందోళన లేనిది. స్వల్పకాలిక పంట రుణం రూ.1.60 లక్షల వరకు 7 శాతం వడ్డీ ఎంతో మేలు. క్రాప్‌లోన్ తీసుకుని వ్యవసాయ అవసరాలకు అధిక మొత్తం కావాల్సిన సందర్భంలో కూడా కోఆపరేటివ్ బ్యాంక్‌లో ఎస్‌టీ లోన్లు కూడా అతి తక్కువ డాక్యుమెంటేషన్‌తోనే రుణం అందుతోంది. – బొర్ర రమేష్, రైతు, చండిపుట్టుగ

సీఎం జగన్ స్ఫూర్తితోనే మహిళా బిల్లు



పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి సాదరంగా ఆహ్వానిస్తున్న కృష్ణదాస్

నరసన్నపేట: రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మహిళా సాధికారిత పెరిగిందని, నామినేటెడ్ పదవుల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు అమలయ్యాయని నరసన్నపేట ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ఈ స్ఫూర్తితోనే పార్లమెంట్‌లో 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లును కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని చెప్పారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బిల్లుకు వైఎస్సార్ సీపీ ఎంపీలు మద్దతు పలకడం పట్ల రాష్ట్రంలోని ఆడపడుచులంతా గర్విస్తున్నారని పేర్కొన్నారు. మండలాల్లో మహిళా జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేయడం ద్వారా బాలికల్లో డ్రాపౌట్స్ తగ్గుతున్నారన్నారు.

వైఎస్సార్ సీపీలో 20 కుటుంబాల చేరిక..

జలుమూరు: సీఎం జగన్‌మోహన్ రెడ్డి పేదలకు అందిస్తున్న సంక్షేమం, అభివృద్ధికి ఆకర్షితులమై వైఎస్సార్ సీపీలో చేరినట్లు కూర్మనాథపురం టీడీపీ నాయకులు స్పష్టం చేశారు. ఈ మేరకు మబగాంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ సమక్షంలో మాజీ నీటి సంఘం అధ్యక్షుడు రెడ్డి అప్పారావు తోపాటు 20 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. కృష్ణదాస్ వీరిని సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో బెండు సాయన్న, రెడ్డి సత్యనారాయణ, బండి రాము, కె.కృష్ణ, వాన శిమ్మన్న తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వాన గోపి, వైస్ ఎంపీపీ తంగి మురళీకృష్ణ, పార్టీ అధ్యక్షుడు కనుసు సీతారాం, సచివాలయ కన్వీనర్ ధర్మాన జగన్, మొయ్యి మన్మథరావు, పిల్లల దాసుబాబు, శిమ్మ నాగేశ్వరరావు, కొర్ను రాజు, నవిరి పోతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉదార స్వభావం చూపాలి



మాట్లాడుతున్న అపుస్మా రాష్ట్ర కోశాధికారి ఎం.వి.రావు

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రైవేటు పాఠశాలలపై ప్రభుత్వం సానుకూల దృక్పథంలో ఉంటూ ఉదారస్వభావాన్ని చూపించాలని ఏపీ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల సంఘం (అపుస్మా) రాష్ట్ర కోశాధికారి ఎం.వి.రావు అన్నారు. బుధవారం శ్రీకాకుళంలో జిల్లా శాఖ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలపై కొందరు తప్పుడు ప్రచారం చేయడం సరికాదన్నారు. అనంతరం ప్రైవేటు పాఠశాలలు ఎదుర్కొంటున సమస్యలను చర్చిస్తూ పలు తీర్మానాలను ఆమోదించారు. కార్యక్రమంలో అపుస్మా విశాఖ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాసరావు, శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు పి.శ్రీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.లక్ష్మణరావు, గౌరవ అధ్యక్షుడు ఎస్.వెంకటరావు, కోశాధికారి డి.జ్యోతి భాస్కర్, విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.సత్యనారాయణ, చంద్రమోహన్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

22న పాతపట్నంలో జగనన్నకు చెబుదాం

పాతపట్నం: మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఈ నెల 22న ఉదయం పది గంటలకు జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కె.రవిచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. ఇన్‌చార్జి కలెక్టర్, జేసీ ఎం.నవీన్‌కుమార్ హాజరుకానున్నారని పేర్కొన్నారు. ప్రజల వినతులు స్వీకరించి, తక్షణమే పరిష్కరించేందుకు జగనన్నకు చెబుదాం దోహదపడుతుందన్నారు.

● బొజ్జ గణపయ్య.. ఆరగించవయ్యా!



సోంపేట పట్టణంలోని కన్యాక పరమేశ్వరి దేవాలయంలో కొలువుదీరిన వినాయకుడికి ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు బుధవారం 108 రకాల నైవేద్యాలు సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. - సోంపేట

గుర్తు తెలియని వ్యక్తి మృతి

టెక్కలి రూరల్: స్థానిక అంబేడ్కర్ జంక్షన్‌లో బన్నువాడకు వెళ్లేదారిలో ఎరువుల దుకాణాల వద్ద బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. బుధవారం ఉదయం సంబంధిత షాపు యజమాని వచ్చేసారికి గుర్తు తెలియని వ్యక్తి దుప్పటి కప్పుకుని పడుకుని ఉండటం గుర్తించారు. ఎంత లేపినా స్పందించకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ రామకృష్ణ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా వ్యక్తి మృతిచెందాడని, మృతుడు యాచకుడని గుర్తించారు. అనంతరం మృతదేహాన్ని శవపంచనామా నిమిత్తం టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం రైలు నిలయం సమీపంలో గుర్తు తెలియని యువకుడు మృతి చెందినట్లు ఆర్‌పీఎఫ్ ఎస్ఐ ఎస్‌కే షరీఫ్ తెలిపారు. బుధవారం వేకువజామున బరంపురం వైపు వెళ్లే డౌన్‌లైన్ ట్రాక్‌లో పాతాళ సిద్ధేశ్వరాలయం సమీపంలో గుర్తు తెలియని రైలు ఢీకొని సుమారు 40 ఏళ్ల వ్యక్తి మృతిచెందాడని, గుర్తుపట్టలేని విధంగా శరీరం ఛిద్రమైందని పేర్కొన్నారు. నలుపు ఫ్యాంట్, టీషర్ట్ ధరించి ఉన్నాడని, కుడిచేతికి సిల్వర్ కడియం, ఫ్యాంట్ జేబులో బైక్ కీ ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. కేసు నమోదుచేసి మృతదేహాన్ని పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

ఫోన్‌లో వేధిస్తున్నాడని మహిళ ఫిర్యాదు

సారవకోట: సంతకవిటి మండలం తమరం గ్రామానికి చెందిన అంబకంటి సురేష్ ఫోన్ చేసి వేధిస్తున్నాడంటూ సారవకోట మండలం చిన్నకిట్టాలపాడుకు చెందిన వివాహిత బుధవారం స్థానిక పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేసింది. నిత్యం ఫోన్ చేసి అసభ్యకరంగా మాట్లాడుతూ కోరిక తీర్చాలని వేధిస్తున్నాడని, లేనిపక్షంలో ఫొటోలు మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పెడతానని బ్లాక్ మెయిల్ చేస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ రమణమూర్తి తెలిపారు.

కుళ్లు తెగులుపై అప్రమత్తం



జమ్ము వద్ద వరి పైరును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

నరసన్నపేట: వాతావరణంలో మార్పుల కారణంగా వరి పైరును కుళ్లు, పొడ తెగులు, ఆకుముడత వంటి తెగుళ్లు ఆశించే ప్రమాదం ఉందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త భాగ్యలక్ష్మి అన్నారు. ఆమదాలవలస రైతు శిక్షణా కేంద్రానికి చెందిన శాస్త్రవేత్త ఉదయబాబుతో కలిసి బుధవారం నరసన్నపేట మండలం జమ్ము తదితర గ్రామాల పరిధిలోని వరి పైర్లు పరిశీలించారు. పరిశీలనలో నరసన్నపేట వ్యవసాయాధికారి కె.సునీత ఉన్నారు.

సమస్యలు పునరావృతం కాకూడదు

- 'జగనన్నకు చెబుదాం'లో ఇన్‌చార్జి కలెక్టర్ ఎం.నవీన్



వినతులు అందజేస్తున్న ఫిర్యాదుదారులు

రణస్థలం: కొవ్వాడ అణువిద్యుత్‌తో పాటు ఇతర సమస్యలు పదేపదే పునరావృతం అవుతున్నాయని, అలా కాకుండా పరిష్కరించాల్సిన బాధ్యత మండల స్థాయి అధికారులపై ఉందని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్, జేసీ ఎం.నవీన్ అన్నారు. రణస్థలం మండల పరిషత్ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం మండల స్థాయి స్పందన కార్యక్రమం జిల్లా ఉన్నతాధికారుల సమక్షంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారుల వద్దకు ఫిర్యాదుదారులు వచ్చినప్పుడు సమస్య ఎందుకు పరిష్కారం కాలేదో వివరంగా చెప్పాలన్నారు. అంతేతప్ప పదేపదే ఫైల్ తిప్పడం సరికాదన్నారు. అనంతరం రెవెన్యూ శాఖకు సంబంధించి 30, సివిల్ సప్లయ్ 4, కొవ్వాడ అణు విద్యుత్ 33, పంచాయతీరాజ్ 35, గృహ నిర్మాణశాఖ 7, విద్యుత్‌శాఖ 10, ఉపాధి హామీ 1, ఆరోగ్యశాఖ 1, స్త్రీ శిశు సంక్షేమ శాఖ 1 చొప్పున మొత్తం 122 సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కొవ్వాడ అణువిద్యుత్ ప్రాజెక్టు నేపథ్యంలో మౌలిక వసతుల కల్పన పూర్తిగా నిలిచిపోవడంతో రోడ్డు అధ్వానంగా మారిందని, విద్యుత్, పరిహారం వంటి సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. తోటపల్లి కాలువ పెండింగ్ పనులు పూర్తి చేయాలని, కమ్మసిగడాం దేవరాపల్లి రోడ్డు పునర్నిర్మించాలని, ఎన్‌హెచ్–16 నుంచి బండిపాలెం రహదారి మరమ్మతులు చేయాలని, పాతర్లపల్లి నుంచి దేరసాం, జీరుపాలెం నుంచి గోసాం వరకు, బొంతుపేట నుంచి మహంతిపాలెం వరకు రోడ్డు బాగు చేయాలని, రణస్థలం డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని వినతిపత్రాలు అందజేశారు. జె.ఆర్.పురం పంచాయతీలోని వెంకటేశ్వర కాలనీలో కాలువ సమస్యలతో పాటు, మండల కేంద్రంలో కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్, ఆర్డీవో బొడ్డేపల్లి శాంతి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు పి.మురళీకృష్ణ, జయదేవి, డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్, జెడ్పీ సీఈవో ఆర్.వెంకటరామన్, డీపీఓ వి.రవికుమార్, డీఎల్‌డీఓ వాసుదేవరావు, ఏపీసీ రొణంకి జయప్రకాష్, డ్వామా పీడీ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

జనావాసాల్లో జాగ్రత్తగా నడపాలి



ట్రాన్స్‌పోర్టు యజమానులతో మాట్లాడుతున్న డీఎస్పీ

టెక్కలి రూరల్: మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు నిర్మాణానికి సరుకులు రవాణా చేసే వాహనాలు జనావాసాలను ఆనుకుని వెళ్లేటప్పుడు వేగ నియంత్రణ పాటించాలని టెక్కలి డీఎస్పీ బాలచంద్రారెడ్డి అన్నారు. బుధవారం తన కార్యాలయంలో పోర్టు ట్రాన్స్‌పోర్టు వాహన యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాళ్ల వంటి ముడి సరుకులు తీసుకువెళ్లే వాహనాలు పూర్తిస్థాయిలో ఫిట్‌నెస్ కలిగి ఉండాలన్నారు. పరిమితికి మించి లోడ్ వెయ్యరాదన్నారు. ప్రజలు భయాందోళన గురయ్యేలా వాహనాలు నడపరాదని సూచించారు. లోడ్ బయటకు కనిపించకుండా టార్పాలిన్లు కప్పి ఉంచాలన్నారు. మూలపేట మూడురోడ్ల జంక్షన్ వద్ద పోలీస్ చెక్‌పోస్ట్ ఏర్పాటు చేసి వాహనాల ఫిట్‌నెస్ తనిఖీ చేస్తామన్నారు. సమావేశంలో సీఐ చంద్రమౌళి, ఎస్ఐ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అందరి సంక్షేమమే లక్ష్యం



వీసీ వెంకటరావును సన్మానిస్తున్న నాన్ టీచింగ్ సిబ్బంది

ఎచ్చెర్ల క్యాంపస్: వర్సిటీలో సిబ్బంది సంక్షేమమే లక్ష్యమని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు అన్నారు. బోధనేతర సిబ్బంది వేతనాల పెంపుపై హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం వీసీ, వర్సిటీ అధికారులకు సన్మానం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోధనేతర సిబ్బందిని మూడు కేటగిరీలుగా విభజించి వేతనాలు పెంచినట్లు చెప్పారు. ఇందుకోసం ప్రత్యేక కమిటీ వేశామన్నారు. అందరూ సమష్టిగా పనిచేస్తేనే ప్రగతి సాధ్యమవుతుందన్నారు. 113 మందికి విద్యార్హత, ప్రస్తుతం పోస్టుల ఆధారంగా విభజించి వేతనాలు అమలు చేసినట్లు చెప్పారు. గతంలో సబ్జెక్టు కాంట్రాక్టులకు సైతం మెరుగైన వేతనాలు అమలు చేసినట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ సీహెచ్ఏ రాజేంద్ర ప్రసాద్, ప్రిన్సిపాళ్లు బిడ్డిక అడ్డయ్య, ఎస్.ఉదయ్‌భాస్కర్, సీహెచ్ రాజశేఖర్‌రావు, పాలక మండలి సభ్యురాలు ప్రొఫెసర్ పీలా సుజాత తదితరులు పాల్గొన్నారు.

శ్రీశయన కార్పొరేషన్ చైర్మన్‌గా డి.పి.దేవ్



డి.పి.దేవ్‌ను సన్మానిస్తున్న సంఘ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): శ్రీశయన కార్పొరేషన్ చైర్మన్‌గా డి.పి.దేవ్‌ను నియమిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఈ సందర్భంగా దేవ్ మాట్లాడుతూ తన నియామకం పట్ల సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి ధర్మాన ప్రసాదరావు, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్‌లకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి తమ కులానికి మంచి సేవలు అందిస్తానని చెప్పారు. కార్పొరేషన్ చైర్మన్‌గా నియామకం పట్ల శ్రీయన సంక్షేమ సంఘం నాయకులు బుధవారం ఆయన నివాసంలో కేక్ కట్ చేసి సన్మానించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు గుజ్జల శాంతీశ్వరరావు, బి.పండరీనాథ్, కోట రామారావు, జాక శ్యామ్‌సుందర్, జోగి అప్పలస్వామి, కర్రి రంగాజీదేవ్, చింతనిప్పుల రాజేంద్ర పాల్గొన్నారు.